డిసెంబర్‌లో విజయోత్సవ సభ

వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ సర్కారే ● ఇప్పటివరకూ చూసిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమే: మంత్రి కేటీఆర్

- అప్పుచేసి ప్రాజక్టులపై పెట్టుబడి పెట్టాం
- కేసీఆర్‌ను కట్టడి చేసేందుకే రాహుల్, మోదీ అసత్య ఆరోపణలు
- 50ఏండ్లుగా ఉన్న లైసెన్స్‌రాజ్‌ను అంతం చేసిందే సీఎం కేసీఆర్
- నిరంతర కరెంటుతో పారిశ్రామిక వేత్తల ముఖాల్లో వెలుగులు
- మళ్లీ బీఆర్ఎస్సే రావాలని వాళ్లంతా ధైర్యంగా చెప్తున్నారు: మంత్రి కేటీఆర్

తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): వచ్చే ఎన్నికల్లో గెలిచి నిలిచేది మనమేనని, డిసెంబరు మొదటి వారంలో ఇక్కడే విజయోత్సవసభ నిర్వహించుకుందామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు తాము చేసిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పరిశ్రమల అనుమతులను సులభతరం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, నిరంతర విద్యుత్తుతో నేడు పారిశ్రామికవేత్తల ముఖాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. తొమ్మిదేండ్లలో ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూనే, విపక్షాల విమర్శలను తిప్పికొట్టారు. మళ్లీ బీఆర్ఎస్సే రావాలని పారిశ్రామికవేత్తలే కోరుకోవడం తమకు గర్వకారణమని, వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఒక్క మెసేజ్ పెట్టండి చాలు

ఈసారి కూడా విజయం తమదేనని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. డిసెంబర్ మొదటి వారంలో ఇదే హాలులో విజయోత్సవ సభను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమస్యలేవైనా ఉంటే అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే చేపట్టిన పనుల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్యలపై ఆలస్యం చేయకుండా తనకు మెసేజ్ పెడితే సరిపోతుందని చెప్పారు.

> ఈ భూమిపైకి అందరూ ఎక్స్‌పైరీ డేట్‌తోనే వస్తారు. పనికిమాలిన ఇగోలతో బతుకుతుంటారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఇందిరాగాంధీ, ఎన్టీ రామారావు వంటివారు కూడా ఎన్నికల్లో ఓడిపోయారు. మేం అంతకన్నా పెద్ద వాళ్లం కాదు. ఎవరైనా ఎప్పుడో ఒకప్పుడు కుర్చీ దిగాల్సిందే. దీనికి ఫెవికాల్ కానీ, ఫెవిక్విక్ కానీ లేదు. ఐదేళ్ల కోసారి వచ్చే పరీక్షలో పాస్ కావాల్సిందే.

> 50 వేల మంది మార్చ్‌చేసి ఆంధ్రావాళ్ల ఆస్తులన్నీ తీసుకుంటారట కదా. ఆంధ్రావాళ్లను తన్ని తరిమిమేస్తారట కదా.. నాకు వాట్సాప్‌లో మెసేజ్ వచ్చిందని మహిళా పారిశ్రామికవేత్త ఒకరు అప్పట్లో నన్ను అడిగారు. మాది స్టేట్ ఫైటే తప్ప స్ట్రీట్ ఫైట్ కాదని ఆమెకు చెప్పాను. ఎలాంటి పంచాయితీలు ఉండవని భరోసా ఇచ్చా.
> - మంత్రి కేటీఆర్

అపోహలు పటాపంచలు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఎన్నో అపోహలు ఉండేవని, కరెంటు ఉంటుందా? పెట్టుబడులు వస్తాయా? అసలు వీరికి పాలన చేతనవుతుందా? అని అనుమానాలు వ్యక్తం చేశారని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. వాటన్నింటినీ పటాపంచలు చేశామని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో మొదటి 6 నెలలు కుదురుకోవడానికే సమయం పట్టిందని, కొవిడ్‌తో రెండేండ్లు పోయిందని చెప్పారు. మళ్లీ ఎన్నికలు రావడంతో నికరంగా ఆరేండ్లు మాత్రమే పనిచేసే అవకాశం వచ్చిందని చెప్పారు. 2014లో తాను పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించి హైదరాబాద్‌లో భూముల ధరలు పడిపోవని, ఎవరూ భూములను అమ్ముకోవద్దని చెప్పినట్టు తెలిపారు.

స్వీయ ధ్రువీకరణ విధానం

రాష్ట్రం ఏర్పడిన కొత్తలో సీఎం కేసీఆర్ వివిధ పారిశ్రామికవేత్తల సంఘాలతో 7 గంటల పాటు సుదీర్ఘ సమావేశం నిర్వహించిన అనంతరం అధికారులను పిలిచి సమయానికి అనుమతులు ఇస్తున్నారా? ప్రశ్నించారని, మౌలిక సదుపాయాలు, విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై సీఎం అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానం చెప్పకపోయారని గుర్తుచేశారు. అసలు అనుమతుల కోసం పారిశ్రామికవేత్తలు మన దగ్గరికి ఎందుకు రావాలి? అని ప్రశ్నించినా జవాబు ఇవ్వలేకపోయారని చెప్పారు. దీంతో అదేరోజు పరిశ్రమల అనుమతులకు టీఎస్ ఐపాస్ పేరుతో స్వీయ ధ్రువీకరణ విధానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.

పది నిమిషాలు కరెంటు పోతేనే మెసేజ్‌లు

గతంలో 10 గంటలు కరెంటు పోయినా అడిగేవారే కారని, ఇప్పుడు 10 నిమిషాలు పోతేనే ప్రజలు తట్టుకోలేక మెసేజ్‌లు పెడుతున్నారంటే 24 గంటల కరెంటుకు ఎంతలా అలవాటుపడ్డారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇది తాము సాధించిన విజయమని సంతోషం వ్యక్తంచేశారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో మన తలసరి ఆదాయం 1.14 లక్షలు. ఇప్పుడదని 3.17 లక్షలకు పెరిగిందని చెప్పారు.

ఆ విమర్శలు అర్థరహితం

కుటుంబ పాలన విమర్శలపైనా స్పందించిన కేటీఆర్.. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3.17లక్షల కోట్లకు పెరిగిందని, ఈ లెక్కన చూస్తే తమ కుటుంబం ఒక్కటే బాగుపడినట్టా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే 4 ఓట్లు వస్తాయన్న ఆలోచన తప్ప విపక్షాలకు మరొకటి లేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయలేదు కాబట్టి బీజేపీతో తాము కలిసిపోయామన్న విమర్శల్లో వాస్తవం లేదన్నారు. తాము ఎవరికీ బీ టీం కాదని, తెలంగాణ ప్రజలకు ఏ టీం అని స్పష్టంచేశారు. 'రైతుబంధు'ను నాలుగైదు ఎకరాలకు పరిమితం చేసే విషయమై ఆలోచిస్తామని తెలిపారు. కాళేశ్వరంలో రూ. లక్షకోట్ల అవినీతి జరిగిందన్న రాహుల్‌గాంధీ ఆరోపణలు అర్థరహితమని కొట్టిపడేశారు. ఎన్డీయే లోనో, 'ఇండియా' కూటమిలోనో తాము ఉండాలని అనుకోవడం లేదన్నారు.

> నేను దావోస్ వెళ్లినప్పుడు హోటల్‌లో మంచినీళ్ల బాటిల్ కావాలని అడిగితే బాత్‌రూంలో ట్యాప్ వాటర్ తీసుకుని తాగాలని చెప్పారు. అక్కడ వ్యర్థ జలాలను శుద్ధిచేసి తాగుతున్నారు. వాటికి అక్కడ జ్యూలిక్ వాటర్ అంటారు. మనకా బాధ లేదు.

'పవర్‌ఫుల్ తెలంగాణ' ఆవిష్కరణ

తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్తు రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ఇతర రాష్ట్రాల్లోని విద్యుత్తు రంగ దీనస్థితిపై విద్యుత్తుశాఖ ఏడీఈ తుల్జారాంసింగ్ ఠాకూర్ వివిధ పత్రికల్లో రాసిన విశ్లేషణాత్మక వ్యాసాలతో కూడిన సంకలనం 'పవర్‌ఫుల్ తెలంగాణ'ను బుధవారం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు.

స్టేబుల్ గవర్నమెంట్ వల్లే పెట్టుబడులు

రాష్ట్రంలో స్టేబుల్ గవర్నమెంట్.. ఏబుల్ లీడర్షిప్ ఉండడం వల్లే మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి పెట్టుబడులు తరలివస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విపక్షాలు తరచూ ఆరోపిస్తున్నాయని, తాము అప్పులు తెచ్చి ఉత్పాదక రంగాలపై పెడుతున్నట్టు తెలిపారు. విద్యుత్తు సమస్య నివారణకు పవర్ ఇన్‌స్టాల్డ్ సామర్థ్యాన్ని 7 వేల మెగావాట్ల నుంచి 24 వేల మెగావాట్లకు పెంచేందుకు అతిపెద్ద పవర్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నట్టు వివరించారు. ఇది అప్పుకాదని, ఉత్పాదక పెట్టుబడి కిందకు వస్తుందని తెలిపారు. అప్పులు అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ 23వ స్థానంలో ఉన్నదని చెప్పారు. మోదీ కన్నా ముందు పాలించిన 14మంది ప్రధానులు 56 లక్షల కోట్లు అప్పు చేస్తే, మోదీ ఒక్కరే 112 లక్షల కోట్లు అప్పు చేశారని గుర్తుచేశారు.

సంగారెడ్డి బహిరంగ సభకు భారీగా హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

కేసీఆర్‌ను దెబ్బతీసేందుకే దండయాత్ర

మోదీ, సోనియా, రాహుల్.. మేం ఎవరికీ భయపడం

- కేసీఆర్‌ను తెలంగాణ కాపాడుకుంటది
- కాంగ్రెస్ కావాలో? కరెంటు కావాలో ప్రజలే తేల్చుకోవాలి
- విద్యుత్తు తీగలు పట్టుకుంటే కరెంటు ఉందో.. లేదో తెలుస్తది
- రేవంత్, జగ్గారెడ్డికి కేటీఆర్ సవాల్
- ఆలోచించి సెక్యులర్ నేతకు ఓటేద్దాం
- ముస్లింలకు మంత్రి కేటీఆర్ పిలుపు
- బీఆర్ఎస్ అభ్యర్థి చింతాను గెలిపిద్దాం
- సంగారెడ్డి సభలో మంత్రి కేటీఆర్

సంగారెడ్డి, నవంబర్ 8(నమస్తే తెలంగాణ) : తెలంగాణకు ఏకైక గొంతుక.. రాష్ట్ర ప్రయోజనాల గురించి గట్టిగా మాట్లాడే ఏకైక నాయకుడు కేసీఆర్ బొనిగి పిసికేందుకు ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ, కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తమ సైన్యంతో తరలివస్తున్నారని, ఎంతమంది బబ్బర్‌షేర్లు..తీస్మార్‌ఖాన్‌లు వచ్చినా తాము భయపడేది లేదని మంత్రి కేటీఆర్ తేల్చిచెప్పారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను తెలంగాణ సమాజం కడుపులో పెట్టుకుని కాపాడుకుంటుందని పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డిలో బీఆర్ఎస్ యువజన, విద్యార్థి ఆత్మీయ సమ్మేళనం, బహిరంగ సభ జరిగింది. సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం కేసీఆర్‌ను దెబ్బకొట్టేందుకు ఒకదిక్కు నుంచి ప్రధాని మోదీ, అమిత్‌షా, 15 మంది బీజేపీ సీఎంలు, 15 మంది కేంద్రమంత్రులు వస్తున్నట్టు చెప్పారు. మరో దిక్కు నుంచి సోనియా, రాహుల్, మల్లికార్జున్‌ఖర్గే, సిద్ధరామయ్య తెలంగాణ వస్తున్నట్టు తెలిపారు. కేసీఆర్ వందసీట్లతో గెలిస్తే మౌనంగా కూర్చోడని.. మహారాష్ట్ర, కర్ణాటకలో ప్రవేశించి బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడిస్తారని తెలిసి మోదీ, రాహుల్ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

రేవంత్, జగ్గారెడ్డికి బంపరాఫర్

కరెంటు కనబడడం లేదన్న రేవంత్‌రెడ్డి, జగ్గారెడ్డికి తాను బంపరాఫర్ ఇస్తున్నానని, తాము ఏర్పాటు చేసిన ఏసీ బస్సులో సంగారెడ్డి నియోజకవర్గంలోని ఏదో ఒక ఊరుకు వెళ్లి వైర్లు పట్టుకుంటే కరెంటు ఉందో? లేదో తెలుస్తుందని అన్నారు. ఇన్వెర్టర్ల గబ్బు తెచ్చిన కాంగ్రెస్ కరెంటు గురించి మాట్లాడుతుంటే బాధగా ఉందన్నారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రైతులు, ప్రజలకు కరెంటు కష్టాలు తప్పవని హెచ్చరించారు. వారు ఏం చేశారని మరో చాన్స్ ఇవ్వాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ కావాలో? కరెంటు కావాలో? తేల్చుకోవాలని ప్రజలకు సూచించారు.

సంగారెడ్డిలో కేటీఆర్ రోడ్‌షో విజయవంతం

సంగారెడ్డిలో బుధవారం మంత్రి కేటీఆర్ రోడ్‌షో విజయవంతమైంది. ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. వేలాదిమంది యువకులు, విద్యార్థులు రోడ్‌షోలో పాలుపంచుకున్నారు. సంగారెడ్డి మండలం కందినుంచి ప్రారంభమైన రోడ్‌షో సంగారెడ్డిలోని పాతబస్టాండు వరకు కొనసాగింది. వేలాది మంది యువకులు, కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీలో పాల్గొన్నారు. జై కేటీఆర్..జై కేసీఆర్ నినాదాలతో సంగారెడ్డి మార్మోగింది.

జగ్గారెడ్డిని చేర్చుకోబోం

తనను గెలిపిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్తానని సంగారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డి చెప్పుకోవడం సరికాదని మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. ప్రజల కోసం పనిచేసే చింతా ప్రభాకర్ ఉండగా జగ్గారెడ్డిని ఎందుకు తీసుకుంటామని ప్రశ్నించారు. ప్రజలకోసం బ్రహ్మాండంగా పనిచేస్తున్న చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని కోరారు. ఆయనను గెలిపిస్తే సంగారెడ్డికి మెట్రోరైలు, ఐటీహబ్ వస్తాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్, కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మామిళ్ల రాజేందర్, మాణిక్యం, ముకీమ్, హకీం, కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, బొంగుల విజయలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలు ఆగం కావొద్దు

ఈ ఎన్నికల్లో ముస్లింలు ఆగం కావొద్దని, ఆవేశంగా నిర్ణయానికి వచ్చి ఓటు వేయొద్దని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ముస్లిం సంక్షేమానికి కట్టుబడిన కేసీఆర్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. సంగారెడ్డి సభలో మంత్రి కేటీఆర్ 10 నిమిషాలకు పైగా ఉర్దూలో అనర్గళంగా ప్రసంగించారు. సభా వేదిక పక్కనే ఉన్న మసీదు నుంచి ఆజాన్ వినిపించగానే ఐదు నిమిషాల పాటు తన ప్రసంగాన్ని నిలిపివేశారు. రాష్ట్రంలో తొమ్మిదన్నరేండ్లుగా శాంతియుత వాతావరణం నెలకొన్నదని, మతం పేరుతో కేసీఆర్ ఎప్పుడూ రాజకీయాలు చేయలేదని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 50 లక్షలు ఉన్న ముస్లిం జనాభా సంక్షేమం కోసం కేసీఆర్ రూ.2100 కోట్లు ఖర్చు చేశారని, అలాంటి కేసీఆర్‌ను కాపాడుకునే బాధ్యత ముస్లింలపై ఉన్నదని అన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లెలో బుధవారం మంత్రి కే తారక రామారావుకు మద్దతు తెలుపుతున్న కేసీఆర్‌నగర్ వాసులు

మంత్రి కేటీఆర్‌కు రజకుల మద్దతు

సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్, నవంబర్ 8 : సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు రోజురోజుకు మద్దతు వెల్లువెత్తున్నది. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన కేటీఆర్‌కే మరోసారి పట్టంకడుతామంటూ అన్నివర్గాల ప్రజలు ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నారు. బుధవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రజకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తంగళ్లపల్లి మండలం రామన్నపల్లెలోని కేసీఆర్‌నగర్ వాసులు (డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం) మంత్రి కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. తమకు గూడునిచ్చిన కేటీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. కారు గుర్తుకే ఓటేస్తామని వారు స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లింగాపూర్‌లో గాలిపెల్లి లక్ష్మమ్మ అనే వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్.
- మానకొండూర్ రూరల్

నామినేషన్ల పరిశీలనకు నలుగురే రావాలి

- ఉపసంహరణ సమయంలో ఒక్కరికే అనుమతి: వికాస్‌రాజ్

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన సమయంలో ఒక్కో అభ్యర్థి తరఫున నలుగురిని, నామినేషన్ల ఉపసంహరణ సమయంలో ఒక్కరిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని సీఈవో వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో బీఆర్‌కేభవన్‌లో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ఉపసంహరణ సమయంలో అభ్యర్థి గానీ ఆయనను ప్రతిపాదించిన వ్యక్తి లేదా ఎన్నికల ఏజెంట్ రావాల్సి ఉంటుందని తెలిపారు. పార్టీలు తమ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలను వెంటనే సమర్పించాలన్నారు. మ్యానిఫెస్టోలను విడుదల చేసిన 3 రోజుల్లోగా వాటి ప్రతులను అందజేయాలని సూచించారు. మీడియాలో అభ్యర్థులు, పార్టీలు చేసే ప్రచారానికి సంబంధించిన కంటెంట్‌కు 3 రోజుల ముందే అనుమతి తీసుకోవాలని, రిజిస్టర్డ్ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులైతే వారం ముందే అనుమతి తీసుకోవాలని కోరారు. ఓటరు గుర్తింపు కార్డుల ముద్రణను ఈ నెల 15లోగా పూర్తిచేస్తామని తెలిపారు. ఈ నెల 10 తర్వాత బీఎల్వోల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీని ప్రారంభిస్తామని చెప్పారు.

రేవంత్‌పై కేసు పెట్టాలి: భరత్ కుమార్

బహిరంగ సభల్లో బూతులు మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై సుమోటోగా కేసులు నమోదు చేయాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ ఈ సమావేశంలో కోరారు.

ఎన్నికల వరల్డ్ కప్ మాదే

- 30న సిక్స్ కొట్టి హ్యాట్రిక్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- మోదీని ఓడించి కప్ గెలుస్తాం
- కేసీఆర్‌కు సబ్‌స్టిట్యూట్ అవసరం లేదు
- 30కి పైగా ఎంపీ స్థానాలు గెలుస్తాం
- మోదీకి రాహుల్‌గాంధీ అతిపెద్ద ఆస్తి
- ఇండియా టుడే రౌండ్‌టేబుల్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఈ నెల 30న జరుగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సిక్స్ కొట్టి రాష్ట్రంలో హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో మోదీని ఓడించి 'ఎలక్షన్ వరల్డ్ కప్' గెలుస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. ప్రముఖ మీడియా సంస్థ ఇండియా టుడే నిర్వహించిన 'తెలంగాణ రౌండ్‌టేబుల్' కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల మాదిరిగానే తాము ఎన్నికల పరీక్షలు రాస్తున్నామని, ఎంత మెజార్టీ వస్తుందనే ఆసక్తితో ఎదురు చూస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారని, సీఎం కేసీఆర్‌నే గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కొంతమంది చేరికలతో కాంగ్రెస్‌కు కొంత ఊపు వచ్చినట్టు కనిపిస్తున్నదని, కానీ క్షేత్రస్థాయిలో ఆ పార్టీ పుంజుకోలేదని అన్నారు. గత ఆరు నెలల్లోనే బీజేపీ పని అయిపోయిందని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ జాతీయ పార్టీలు కాబట్టి డబ్బులు, వనరులు ఎక్కువగా ఉంటాయని, అందుకే హడావుడి చేస్తున్నాయని, మైండ్ గేమ్ ఆడుతున్నాయని అభిప్రాయపడ్డారు. వాస్తవానికి రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నాయని విమర్శించారు. బండి సంజయ్‌పై కాంగ్రెస్ ఒక అనామకుడిని పోటీలో ఉంచిందని, ధర్మపురి అర్వింద్‌పైనా డిపాజిట్ కూడా వచ్చే అవకాశం లేని వ్యక్తిని పోటీకి దింపిందని ఆరోపించారు.

బీజేపీని అడ్డుకున్నది మేమే

మోదీకి రాహుల్‌గాంధీ పెద్ద ఆస్తి అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాహుల్ ఉన్నంత కాలం కాంగ్రెస్‌కు బీజేపీని ఆపే శక్తి రాదని స్పష్టంచేశారు. ఆ శక్తే ఉంటే గుజరాత్‌లో, యూపీలో ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. మొదటి నుంచీ బీజేపీని ప్రాంతీయ పార్టీలే నిలువరించాయని, మోదీని కేసీఆర్, మమతాబెనర్జీ, స్టాలిన్, కేజ్రీవాల్ వంటి ప్రాంతీయ పార్టీల నేతలే ప్రశ్నించారని చెప్పారు. పొరుగున ఉన్న కర్ణాటకలో 2013 నుంచి 2018 వరకు కాంగ్రెస్, 2018 నుంచి 23 వరకు బీజేపీ అధికారంలో ఉన్నాయని గుర్తు చేశారు. రెండు జాతీయ పార్టీలు పాలించిన కర్ణాటకతో, బీఆర్ఎస్ పాలనలో ఉన్న తెలంగాణను పోల్చి చూడాలని కోరారు. తలసరి ఆదాయం మొదలు ఏ రంగంలో చూసినా తెలంగాణదే పైచేయి అని చెప్పారు. ఐటీ ఉద్యోగాల కల్పనలో తెలంగాణ వరుసగా రెండో ఏడాది కర్ణాటకను అధిగమించిందని చెప్పారు. గతేడాది దేశంలో సృష్టించిన ఐటీ ఉద్యోగాల్లో 33 శాతం తెలంగాణలోనే రాగా, ఈ ఏడాది 44 శాతానికి పెరిగిందని తెలిపారు.

30కిపైగా ఎంపీ స్థానాలు గెలుస్తాం

ఒకేసారి దేశవ్యాప్తంగా పోటీ చేయాలనే ఆశ తమకు లేదని, క్రమంగా విస్తరిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇటీవలే మహారాష్ట్రలో బీఆర్ఎస్ 50కి పైగా సర్పంచ్ స్థానాలు గెలిచిందని గుర్తు చేశారు. తెలంగాణలో హ్యాట్రిక్ కొట్టిన తర్వాత మహారాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్తామని చెప్పారు. అక్కడ 48 ఎంపీ సీట్లలో కనీసం 15 నుంచి 20 స్థానాలు గెలుస్తామన్నారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, ఏపీ.. ఇలా సార్వత్రిక ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కనీసం 30కి పైగా ఎంపీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తంచేశారు. కేంద్రంలో సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తామన్నారు. కేసీఆర్ జాతీయ సంపద అని, తెలంగాణ మాదిరిగా దేశాన్ని కూడా అభివృద్ధి చేస్తారని చెప్పారు.

డీప్ ఫేక్‌ను అరికట్టేందుకు చర్యలు

డీప్ ఫేక్ టెక్నాలజీ సాయంతో ప్రముఖ నటి రష్మిక మందన్న అశ్లీల వీడియోను సృష్టించి, వైరల్ చేసిన ఘటనను మంత్రి కేటీఆర్ ఖండించారు. ఒక మహిళను, సెలబ్రిటీని ఈ విధంగా అవమానించడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కచ్చితంగా ఆలోచిస్తామని చెప్పారు. అవసరమైతే చట్టం కూడా చేస్తామన్నారు. కేంద్రం కూడా ఇలాంటి చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌కు సబ్‌స్టిట్యూట్ అవసరం లేదు

వరల్డ్ కప్ నేపథ్యంలో పలు అంశాలపై మంత్రి కేటీఆర్ క్రికెట్ పరిభాషలో సమాధానం ఇచ్చారు. 'మా కెప్టెన్ సీఎం కేసీఆర్ చాలా ఆరోగ్యంగా ఉన్నారు. ఆయనకు సబ్‌స్టిట్యూట్ అవసరం లేదు' అని పేర్కొన్నారు. తాను క్రికెట్ చూస్తానని, అయితే తెలంగాణలో ఎన్నికల వరల్డ్ కప్ నడుస్తున్నందున వరల్డ్ కప్ చూడటం లేదని చెప్పారు. 'నవంబర్ 30న సిక్స్ కొట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. 2024లో మోదీని ఓడించి ప్రపంచ కప్ గెలుస్తాం' అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ భారత జట్టు మాదిరిగా బలంగా ఉన్నదని అన్నారు. కాంగ్రెస్‌ను స్థిరత్వం, ఐకమత్యం లేని పాకిస్థాన్ జట్టుతో పోల్చారు. బీజేపీ పేరుగొప్ప, ఊరు దిబ్బ మాదిరిగా ఆడుతున్న ఇంగ్లండ్ జట్టుతో పోల్చారు.

మూడో వ్యక్తిని ఎదగనీయరు

దేశంలో మూడో వ్యక్తి ఎదగడం ప్రధాని మోదీకి, రాహుల్ గాంధీకి ఇష్టం ఉండదని కేటీఆర్ విమర్శించారు. జాతీయ స్థాయిలో అధికారం, రాజకీయం వాళ్లిద్దరి మధ్యే ఉండేలా చూసుకుంటారని చెప్పారు. అందుకే ప్రజాదరణ పెరుగుతున్న పార్టీని 'బీ-టీం' అని ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తుంటారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ కోల్‌కతాకు వెళ్తే మమతాబెనర్జీని, ఢిల్లీకి వెళ్లి కేజ్రీవాల్‌ను, కర్ణాటక వెళ్లి కుమారస్వామిని బీజేపీకి బీ-టీం అంటారని, మోదీ కూడా ఇదే తరహాలో విమర్శలు చేస్తారని వివరించారు. సీఎం కేసీఆర్ మూడోసారి గెలిస్తే జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపిస్తారని రెండు పార్టీలూ భయపడుతున్నాయని చెప్పారు. అందుకే కేసీఆర్‌ను తెలంగాణకే పరిమితం చేసేందుకు 'బీ-టీం' అంటూ దుష్ప్రచారానికి దిగుతున్నాయని మండిపడ్డారు. 2001 నుంచి ఇప్పటివరకు బీఆర్ఎస్ చరిత్రలో ఒక్కసారి కూడా బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని తెలిపారు. ఎంఐఎం గతంలో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిందని, అప్పుడు బీ టీమ్ అని కాంగ్రెస్ చెప్పుకోలేదని, ఇప్పుడు బీఆర్ఎస్‌కు ఎంఐఎం మద్దతు ఇస్తుంటే మాత్రం బీ టీమ్ అంటున్నారని మండిపడ్డారు.

- బీఆర్ఎస్‌లోకి ఐదుగురు సీపీఐ కౌన్సిలర్లు

కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు సీపీఐ కౌన్సిలర్లు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ ఫ్